క్లుప్తంగా

ఇసుక తవ్వకాలపై తనిఖీలు



వారతిప్పలో మట్టితవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

మొగల్తూరు: అనుమతులు లేకుండా తవ్వుతున్న ఇసుక తవ్వకాలపై గురువారం మైనింగ శాఖాధికారులు తనిఖీలు చేశారు. మండలంలోని వారతిప్ప గ్రామంలో పర్యటించిన అధికారులు మట్టి తవ్వుతున్న ప్రాంతాలపై దాడులు నిర్వహించారు. జిల్లా మైనింగ్ జియాలిజీ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కేవీ రమణ, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌లు తవ్వకాలు పరిశీలించి వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు. వీరి వెంట వీఆర్‌ఓ సుజాత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మొగల్తూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రవిశంకర్



రవిశంకర్ సర్కార్

మొగల్తూరు: తాను చదువుకున్న పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందంగా ఉందని వర్ధమాన రవిశంకర్ సర్కార్ తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా వీరవాసరం మండలంలోని మత్స్యపురి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సర్కార్‌ను మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ ఇదే గ్రామానికి చెందిన తాను ఇదే పాఠశాలలో 1982–83లో పదో తరగతి వరకు చదువుకున్నాని, తిరిగి ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

నేడు చించినాడ లంక భూముల్లో చెల్లెం పర్యటన

యలమంచిలి: చించినాడ పెరుగులంక భూముల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు పర్యటిస్తానని ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న లిఖిత పూర్వకంగా తనకు తెలియజేయాలని ఆయన కోరారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య సానుకూలంగా పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

కె.బేతపూడిలో సమిత్వా సదస్సు

నరసాపురం రూరల్: జగనన్న భూ హక్కు–భూరక్ష లో భాగంగా సమిత్వా కింద ఇళ్లు, భూములు, స్థలాలు ఉన్న హక్కుదారులకు భూ హక్కు పత్రాలు జారీ నిమిత్తం గ్రామ సభను నిర్వహించినట్లు తహసీల్దార్ ఫాజిల్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నరసాపురం మండలంలోని కె.బేతపూడి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సమిత్వ ద్వారా ఇళ్లు, భూములు, స్థలాల హక్కు దారులకు పత్రాలు అందించే విషయమై గ్రామస్తుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ప్రోపర్టీ పానల్ మ్యాప్ (పీపీఎం) జాబితాలోని 582 మంది వ్యక్తుల పేర్లు, ఆస్థి విస్తీర్ణం, తదితర వివరాలను సభాముఖంగా చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకు రావచ్చునని ఆయన వెల్లడించారు. గ్రామ సర్పంచ్ బెల్లపు రోజారమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈఓపీఆర్‌డీ కె.ఆంజనేయశర్మ, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నిర్మలాజ్యోతి, గ్రామ ఉప సర్పంచ్ జవ్వాది వెంకట కృష్ణ హనుమంతు, గ్రామ కార్యదర్శులు వెంకటేష్ పాల్గొన్నారు.

దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రాలు

పోడూరు: మండువేసవిలో ప్రధాన రహదారుల పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాయి. పోడూరు ఆర్అండ్‌బీ రహదారి మార్గంలో శ్రీసీతారామ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఏజెన్సీ అధినేత పసుమర్తి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ఎండలు ఎక్కువగా ఉన్నందున కవిటం–పోడూరు ఆర్అండ్‌బీ రహదారి మార్గంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు గత 50 రోజులుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కడలి సూర్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, కె.సుభద్ర, కె.వినాయక్, బీఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగులకు గాయాలు

నరసాపురం: పట్టణంలోని నరసాపురం–మొగల్తూరు మార్గం 216 జాతీయ రహదారిపై సత్తిబాబు జ్యూస్ సెంటర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు గాయపడ్డారు. లక్ష్మణేశ్వరం గ్రామ సచివాయంలో పని చేస్తున్న కోపెర్ల విజయదుర్గ , పాత్తూరి వెన్నెల ఇద్దరు స్కూటీపై పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయానికి పని ముగించుకుని వెళ్తుండగా, నరసాపురం వైపు బైక్‌పై వేగంగా వచ్చిన యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెన్నెల పరిస్థితి విషమంగా ఉండటంతో భీమవరం తరలించారు. విజయదుర్గ స్థానికంగా ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు టౌన్ ఎస్సై ప్రసాద్ చెప్పారు.

ప్రమాదాలకు నిలయంగా పేరుపాలెం బీచ్

- అవగాహన లేమితో పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న యువత



బీచ్‌లో సందడి చేస్తున్న సందర్శకులు(ఫైల్)

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ ప్రమాదాలకు నిలయంగా మారింది. సముద్ర స్నానం చేస్తూ గల్లంతవుతున్న వారు కొందరైతే, ప్రమాదాల బారిన పడి కాలు, చెయ్యి విరగకొట్టుకుంటున్న వారు మరికొందరు. చాలామంది యువత సముద్ర స్నానానికి అనువుగా లేకపోయినా ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న అలలను చూసి ఉత్సాహంతో వాటికి ఎదురెళ్లి మృత్యువాత పడుతున్నారు. గత 2015 నుంచి ఇప్పటివరకూ సుమారు 35 మంది పేరుపాలెం బీచ్ వద్ద మృత్యువాత పడ్డారు. 2015లో ఆరుగురు, 2016లో ఇద్దరు, 2017లో ముగ్గురు, 2018లో ఎనిమిది మంది, 2019లో ఐదుగురు, 2021లో నలుగురు, 2022లో నలుగురు, 2023లో ఇప్పటి వరకు ముగ్గురు గల్లంతై మృతి చెందారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుండి పాలకొల్లు శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు సముద్ర స్నానానికి దిగి మృత్యువాత పడి ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపారు.

19 కిలో మీటర్ల సముద్ర తీర ప్రాంతం

నియోజకవర్గంలో సుమారు 19 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. అయితే నరసాపురం మండలంలో లేని విధంగా మొగల్తూరు మండంలోని పేరుపాలెం, కేపీ పాలెం తీరప్రాంతంలో కొబ్బరి, సరుగుడు తోటలతో పాటు ఆలయాలు వెలిశాయి. దీంతో సందర్శకులు రాక మొదలుకావడంతో క్రమేణా బీచ్‌లుగా మారాయి. మూడు దశాబ్దాలు క్రితం కేపీ పాలెం తీరంలో మొట్టమొదటగా వేళాంకణి మాత ఆలయాన్ని నిర్మించడం, అనంతరం సముద్రంలో కొట్టుకు వచ్చిన వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో జిల్లాలోనే తీర ప్రాంతాలు గుర్తింపునకు నోచుకున్నాయి. అంతే కాక ప్రతీ ఏటా మేలో నాలుగు రోజులపాటు వేళాంకణి మాత ఉత్సవాలు, కార్తీకమాసంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహస్తారు. దీంతో తీరంలో సౌకర్యాలు లేకపోయినా, సముద్ర స్నానానికి అనువుగా లేకపోయినా సందర్శకులు తరలివచ్చి సేద తీరుతుంటారు. కార్తీక మాసంలో నెలరోజులపాటు వేలాది మంది పర్యాటకులు సముద్ర స్నానం చేసి ఆలయాలను దర్శించుకుని తీరంలోని కొబ్బరి, సరుగుడు చెట్ల మధ్య వన భోజనాలు చేస్తుంటారు. అయితే ప్రతీ ఏటా వేలాది మంది భక్తులు వస్తున్నా సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటాయి.

సముద్ర స్నానానికి అనువైన ప్రాంతం కాదు

సముద్రంలోకి దిగిన వారికి కాలు అడుగు భాగంలో గొయ్యి కింద ఏర్పడుతుంది. మద్యం సేవించి స్నానాలకు దిగడం లేదా అవగాహన లేకపోవడంతో అలలు వచ్చిన సమయంలో బ్యాలెన్స్ చేసుకోలేక పడిపోయి గల్లంతవుతున్నారు. ఆ ప్రాంతంలో కార్తీకమాసం మినహా మామూలు రోజుల్లో బందోబస్తు ఉండదు. కార్తీక మాసంలో అయితే రెవెన్యూ, పోలీస్ అధికారులు గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని నియమించి సముద్రంలోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. మామూలు రోజుల్లో ఎవరి అడ్డూ అదుపు లేకపోవడంతో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం



పేరుపాలెం బీచ్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌లు ప్రారంభించారు. త్వరలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఇక్కడ బాధ్యతలు చేపడతారు. సముద్ర స్నానానికి వెళ్లే వారికి అవగాహన కల్పించి తగు రక్షణ చర్యలు తీసుకుంటాం.

– ఎం,వీరబాబు, ఎస్సై, మొగల్తూరు

కుళాయి చెరువులో చేపలు పట్టే వేలం వాయిదా

నరసాపురం: మున్సిపాలిటీ కుళాయి చెరువులో చేపలు పట్టుకునేందుకు హక్కులు కల్పించేందుకు గానూ గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట రద్దయ్యింది. మళ్లీ ఈ నెల 12న సోమవారం పాట నిర్వహిస్తామని కమిషర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రారంభ పాటను రూ 5 లక్షలుగా నిర్ణయించి పాట మొదలు పెట్టారు. అయితే చెరువలో ఐదు అడుగులు మించి లోతుకు చేపలు పట్టకూడదని నిబంధన విధంచారు. పాటదారులు చేపలు ఎలా పట్టుకోవాలనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో పాటను వాయిదా వేస్తూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉంటే 20 సంవత్సరాలు తరువాత కుళాయిచెరువులో చేపలు పడుతున్నారు. ఈ హక్కును మత్స్యకారులకే కేటాయించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సీహెచ్ చినరెడ్డప్ప ధవేజీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పెనుగొండ: రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, నాగిశెట్టి గంగారావు, ఎర్రంశెట్టి సుబ్బరాజు, దూలం ప్రసాద్, కంబాల ఆదినారాయణ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం



పిల్లలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ

నరసాపురం: పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగి వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథలయ భవనంలో జరుగతున్న వేసవి ఉచిత విజ్ఞాన శిబిరాన్ని గురువారం సందర్శించారు. శిబిరంలో కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలించి లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనంలో భాగంగా గొప్పగొప్ప వ్యక్తుల జీవిత విశేషాలు తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొందవచ్చని చెప్పారు. పుస్తక పఠనంపై రోజురోజుకూ ఆసక్తి తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు ఈ విషయంలో తగిన శ్రద్ధ తీసుకుని పిల్లలను పుస్తక పఠనం వైపు మళ్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, రిటైర్డ్ శాస్త్రవేత్త ఆర్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు



నేరేడుమిల్లి ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: నేరేడుమిల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. 2008లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ కాలనీలో 30 మందికి పట్టాలు మంజూరు చేశారని వీరిలో ఎక్కువ శాతం దళితులు, బలహీన వర్గాల ప్రజలు ఉన్నారని పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకట జలదుర్గా ప్రసాదరాజు (బుజ్జరాజు) శ్రీనివాస్‌కి వివరించారు. అప్పటి నుంచి రోడ్డులు, డ్రయిన్‌లు, తాగునీటి వసతి కల్పించలేదన్నారు. దీంతో కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న వారంతా వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని బుజ్జిరాజు చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ సంబంధిత అధికారులను పంపించి రోడ్లు, డ్రైయిన్లు, కుళాయిల ఏర్పాటుకు ప్రతిపాదనలు వేయిస్తానని చెప్పారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసి కాలనీలో మౌలిక వసతుల కల్పిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకట జలదుర్గా ప్రసాదరాజు నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, జల్లి నాగేశ్వరరావు, బొక్కా రంగారావు, కాలాబత్తుల నాగేశ్వరరావు, తాళ్లూరి రత్నంరాజు గ్రామ కార్యదర్శి తోటకూర పవన్ కుమార్‌రాజు తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవురు పర్యటన ఇలా

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ శుక్రవారం పర్యటించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 3, 12, 16, 22, 27 వార్డులో జరుగుతున్న నాడు–నేడు పనులు అలాగే మునిసిపల్ సాధారణ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తారని, పట్టణంలోని వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

శుభ్రమైన చించినాడ పంట కాలువ



మేడపాడు వద్ద ఉపాధిహామీ కూలీలు బాగు చేసిన తరువాత శుభ్రమైన చించినాడ పంట కాలువ



యలమంచిలి మండలం మేడపాడు వద్ద చెత్తతో ఉన్న చించినాడ పంట కాలువ (ఫైల్)

యలమంచిలి: ప్రధాన పంట కాలువలకు నీరు వదిలిన నేపథ్యంలో పంట కాలువల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు అక్కరకు వస్తున్నాయి. చించినాడ పంట కాలువ పెనుమంట్ర మండలం నెగ్గిపూడి వద్ద ప్రారంభమై యలమంచిలి మండలం కాజ వద్ద వడ్డిలంక కాలువలో కలవడంతో ముగుస్తుంది. ఈ కాలువ సుమారు 8 వేల ఎకరాల పంట భూములకు సాగునీరు, 15 గ్రామాలకు తాగునీరు అందిస్తుంది. ఇంతటి ప్రాధాన్యమున్న కాలువలో కాలువ పక్కనున్న గృహస్తులు ఇళ్లలోని చెత్తను, కాలువ పరిసర పంట భూములున్న రైతులు చెట్ల ఆకులు, జంతు మృత కళేబరాలు, కోళ్ల వ్యర్థాలను కాలువలోనే వేసేస్తున్నారు. కాలువ ప్రారంభం నుంచి వస్తున్న చెత్త కాలువ శివారున మేడపాడు వద్ద పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డుకు ఉన్న వంతెన వద్ద పేరుకుపోయి ఆగిపోతుంది. దీంతో నీరు ముందుకు కదలక కుళ్లు వాసన వస్తుంటుంది. కాలువ వెంబడి ఇలా పేరుకుపోయిన చెత్తను గత వారం రోజులుగా ఉపాధి హామీ కూలీలు శుభ్రం చేశారు. దీంతో కాలువ ఇప్పుడు శుభ్రంగా కనిపిస్తుంది. ప్రజలు, రైతులు మంచిగా ఆలోచించి కాలువలో వ్యర్థాలు వేయకుండా ఉంటే ప్రజలకు శుభ్రమైన తాగునీరు, రైతులకు సాగునీరు అందుతుందని ప్రజలు కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే సైకిల్ యాత్ర



మొగల్తూరుకు చేరుకున్న విజయ్ గోపాల కృష్ణ సైకిల్ యాత్ర

మొగల్తూరు: జల, జంతు, వన సంరక్షణ నినాదంతో నెలల తరబడి సైకిల్ యాత్ర చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన చాత్రాతి విజయ్‌గోపాల కృష్ణ సైకిల్ యాత్ర చేస్తూ తణుకు, పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం మీదుగా గురువారం మొగల్తూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2022 మార్చి 11న స్వగ్రామం నుంచి బయలు దేరి ఇప్పటి వరకు 11 రాష్ట్రాల్లో పర్యటించానని,ఉదయం పర్యటన మొదలు పెడుతూ మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకుంటానని, రాత్రి పూట దేవాలయం లేదా అనువైన ప్రదేశంలో విశ్రాంతి తీసుకుంటానన్నారు. ఇప్పటి వరుకు ఘనాపూర్, తుల్జాపూర్, షిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వరం, నర్మదానది, నాందేడ్, త్రివేణి సంగమం, కాశీ, అయోధ్య, ఆగ్రా, లక్నో, మధుర, హర్యాయానా, పంబాజ్, సింధూ నది ప్రాంతాల్లో పర్యటించానన్నారు. తన యాత్ర కన్యాకుమారి వరుకూ సాగుతుందని, ఇప్పటి వరకూ సుమారు 430 రోజులు సైకిల్ యాత్ర చేశానని, మరో 70 రోజుల్లో తన యాత్ర పూర్తవుతుందన్నారు. తమ పూర్వీకులు ఇదే జిల్లాలోని తణుకు మండలంలోని కొమరవరం గ్రామమని, 1971లో రాయచూర్‌కు వెళ్లి స్థిరపడ్డామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా లంకలకోడేరు గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జోరుగా సచివాలయ భవన నిర్మాణ పనులు



రూ.42 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో రూ.42 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే భవనం పనులు పూర్తి కాగా, గుమ్మాలు, కిటికీలు, టైల్స్, విద్యుత్ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెలాఖరుకి ఈ పనులన్నీ పూర్తి కానున్నాయి. ఈ పనులన్నీ పూర్తి చేసిన అనంతరం జూలై మొదటి వారంలో ప్రారంభోత్సవం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ తెలిపారు. ఇప్పటికే రూ.17.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.22 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం పనులు పూర్తి చేసి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. రూ.కోటితో నాడు – నాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

వంకతాళ్ల చెరువు రహదారికి మోక్షం



ఆచంట శివారు వంకతాళ్ల చెరువు రహదారికి శ్రీకారం చుడుతున్న సర్పంచ్ కోట సరోజని

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంకతాళ్ల చెరువు రహదారికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో మోక్షం కలిగింది. బుధవారం రహదారి నిర్మాణ పనులకు ఆచంట సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు శ్రీకారం చుట్టారు. దశాబ్ద కాలంగా రహదారి నిర్మాణానికి ఆయా ప్రాంతాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఇటీవల కాలంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో స్థానిక ప్రజలు విన్నవించుకోవడంతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రహదారికి నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని సర్పంచ్ కోట సరోజనీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉల్లం రామానుజం, కుక్కల కిరణ్, గెద్దాడ విశ్వేశ్వరరావు, కామన హరిబాబు, బండి మహేశ్, గుబ్బల రమాకృష్ణ, మండే శ్రీనివాస్, ఎంపీడీఓ వి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఉప ఎన్నికలు



లక్ష్మణేశ్వరం ఉపసర్పంచ్ అల్లు చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు



పండితవిల్లూరు ఉపసర్పంచ్ వెంకటేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు అల్లు చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎన్నికకు 14 సభ్యులు హాజరై ఉప సర్పంచ్‌గా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన దేవిరెడ్డి రామారావు ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన చంద్రశేఖర్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మేడిది నవీన్‌కిరణ్ ఉప సర్పంచ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చాగంటి సత్యనారాయణ, ఆదినారాయణ, సుగుణరావు, వెన్నా మురళీ, చాగంటి నాని, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ, హరికృష్ణ, గ్రామ కార్యదర్శి యర్రంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పండితవిల్లూరు ఉపసర్పంచ్‌గా వెంకటేష్

పోడూరు: పండితవిల్లూరు ఉపసర్పంచ్‌గా పదో వార్డు సభ్యుడు సదమళ్ల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకుముందు ఉపసర్పంచ్‌గా ఉన్న 2వ వార్డు సభ్యురాలు పినిపే సుమజ ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి సీఎస్‌వీ రెడ్డి సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్న సందర్భంగా గ్రామసర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రికకు, సహచర వార్డుసభ్యులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన వెంకటేష్‌ను సొసైటీ ఛైర్మన్ గెద్దాడ ఏకలవ్య, పంచాయతీ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, ఇళ్ల శ్రీనివాస్, కొమ్మూరి నాగబాబు తదితరులు అభినందించారు.